సమాచారం

నేడు రక్తదాన శిబిరం

వనస్థలిపురం: ప్రభంజనం ఫేస్‌బుక్ వారి ఆధ్వర్యంలో తలసీమియా బాధిత పిల్లల కోసం ఆదివారం వనస్థలిపురం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకుడు నక్క శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ రక్తదాన శిబిరం కొనసాగుతుందన్నారు.

క్లుప్తంగా

రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్ల పంపిణీ

మలక్‌పేట: మూసారంబాగ్ చౌరస్తాలోని మహమ్మదీయ మసీద్ ఆవరణలో శనివారం స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి ముస్లింలకు ప్రభుత్వం సరఫరా చేసిన రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, రంజాన్ పండుగ మత సామరస్యతకు ప్రతీక అని అన్నారు. పండుగలు ఆధ్యాత్మికమైన, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. 100 మందికి గిఫ్ట్ ప్యాకెట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జమా సాహెబ్, నియామత్ ఖాన్, మాజీద్, పాషా, బీజేపీ నాయకులు గౌర దేవేందర్, సంతోష, దినేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నియామకాలు

మలక్‌పేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మలక్‌పేట నియోజకవర్గ కన్వీనర్‌గా కోడరి చందర్‌మాదిగ, మూసానగర్‌కు చెందిన ముక్కెర గోపాల్‌మాదిగ గ్రేటర్ కో–కన్వీనర్‌గా, చాదర్ఘాట్‌కు చెందిన దుడ్డేళ్ల రాముమాదిగ ఆజంపుర డివిజన్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర కన్వీనర్ బోయిని ఎల్లేష్ మాదిగ శనివారం వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ నిర్ణయాలకు అనుగుణంగా మాదిగ, మాదిగ ఉపకులాల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. తమకు అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్షుడు జేఆర్ ప్రకాశ్ మాదిగ, ఎల్లేష్ మాదిగలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ దర్శనం రామస్వామి, గ్రేటర్ కన్వీనర్ చిత్రం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

మోదీ పాలనపై అపార విశ్వాసం

మలక్‌పేట: ప్రధాని మోదీ పాలనపై ప్రజలకు అపారమైన విశ్వాసం ఉందని బీజేపీ ఓబీసీ మీడియా అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ అన్నారు. ఓబీసీ కమిటీ ఆధ్వర్యంలో సలీంనగర్‌లో స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, మలక్‌పేట కన్వీనర్ నవీన్‌రెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. కరపత్రాలు పంచిపెడుతూ కేంద్రం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు దేవేందర్, వై.సురేందర్, కొప్పుల దినేష్, నవీన్‌కుమార్, అర్వింద్, గణేష్, తులసి పాల్గొన్నారు.

నిర్దిష్ట ప్రణాళికలతో అభివృద్ధి

మన్సూరాబాద్: నిర్దిష్టమైన ప్రణాళికలతో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధిలోని శివంహిల్స్ కాలనీ, సిరిహిల్స్ కాలనీ, పవనగిరి కాలనీ ఫేజ్–3లో శనివారం మార్నింగ్ వాక్ చేసి ఆయా కాలనీల్లోని సమస్యలు తెలుసుకున్నారు. కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు రాజిరెడ్డి, కృష్ణారెడ్డి, హరినాథ్, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్, పీవీ రావు, సత్తిరెడ్డి, భూపేందర్‌సింగ్, గజ్జల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాంట్రాక్టర్‌ను కోరారు. శనివారం ఆయన బీఎన్ రెడ్డి ఫేస్–3లో ప్రారంభించిన హెచ్‌ఎండీఏ పార్కు పనులను సర్కిల్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సర్కిల్ అధికారులు ఈఈ పద్మ, డీఈ జగన్‌మ్మోహన్, ఏఈ జీవన్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు బీఎం రావు, సోమాని నాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'ఇంట్రాక్షన్ ప్రోగ్రాం'

చైతన్యపురి: కాలనీల్లో నెలకొన్న సమస్యలను వంద రోజుల్లో పరిష్కరించడం కోసమే జీహెచ్‌ఎంసీ ఇంటెన్సివ్ శానిటేషన్, కాలనీ వెల్ఫేర్ సభ్యులతో ఇంట్రాక్షన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. ద్వారకాపురం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం కాలనీవాసులు, ఆయా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, తాగునీరు, స్ట్రీట్‌లైట్స్, రహదారులు తదితర సమస్యలను కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ ఏఈ పార్వతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, చైతన్యపురి పోలీస్ సిబ్బంది, కాలనీవాసులు వెంకటేష్, స్వామినాథన్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య 'యోగ'ం

- యోగా సాధనతో అనారోగ్య సమస్యలకు చెక్
- మానసిక ఆనందం



యోగా నేర్చుకుంటున్న మహిళలు

చైతన్యపురి: విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా అనేక వాటితో నగరవాసులు నిత్యం ఉరుకులు.. పరుగులు జీవితం గడుపుతుంటారు. మానసిక, శారీరక సమస్యలు, ఆందోళనలతో చిన్న వయసులోనే మధుమేహం, బీపీ, గుండెపోటు వంటి అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమంటారు. మనం ఆరోగ్యంగా ఉంటేనే మన లక్ష్యాలను సాధించేందుకు అవకాశం ఉంటుంది. ఇటీవల కోవిడ్ నుంచి కోలుకున్న వారిలో కొత్త ఆరోగ్య సమస్యలు వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి తరుణంలో మనల్ని మనం కాపాడుకొని, ఆరోగ్యాన్ని పరిరక్షించుకొనేందుకు ఉన్న ఏకై క మార్గం యోగా సాధన ఒక్కటే అంటున్నారు యోగా గురువులు.

- నిత్యం యోగా చేయడంతో పాటు ఆహారంలో మార్పులు చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అంటున్నారు.
- వాతావరణంలో మార్పుల ప్రభావం వల్ల వచ్చే శ్వాస సంబంధమైన సమస్యలకు కూడా యోగాతో చెక్ పెట్టవచ్చని యోగా గురువులు చెబుతున్నారు.
- మానసిక ప్రశాంతతో పాటు దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు యోగా సాధన ఒక్కటే మార్గమంటున్నారు.
- శారీరక అనారోగ్యంతో బాధపడే వారికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని, వ్యాధిని నయం చేయడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందని అంటున్నారు.
- యోగా వల్ల శరీరంలోని ప్రతి భాగానికి రక్తప్రసరణ సక్రమంగా జరిగి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, స్త్రీలలో థైరాయిడ్, నడుం నొప్పి, ఆస్తమా, వెన్నునొప్పి, బీపీ, షుగర్ వంటి వ్యాధులను నయం చేస్తుందంటున్నారు.
- సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాత యోగా చేస్తే మంచిదని, ఆహారం తీసుకున్న నాలుగు గంటల తర్వాత యోగా చేయాలని యోగా గురువులు సూచిస్తున్నారు.

అందరి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం



2004లో భిక్షమయ్య గురూజీ దగ్గర యోగా నేర్చుకున్నాను. ఆ రోజు నుంచి నేటి వరకు వేల మందికి యోగాలో శిక్షణ ఇచ్చాను. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలతో వచ్చిన వారు యోగాతో తగ్గిందని చెప్పడం సంతోషం వేస్తోంది. అందరి ఆరోగ్యాన్ని కాపాడలనే సదుద్దేశంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. యోగ సాధన, నేచర్ క్యూర్ విధానం, అమృత ఆహారంపై అవగాహన కల్పిస్తున్నాం.

– ఇస్మాయిల్ గురూజీ, స్వధర్మ యోగి,

నమ్మకం కలిగింది



ఏ అనారోగ్య సమస్య ఉన్నా యోగా సాధనతో తొలగించవచ్చనే నమ్మకం ఏర్పడింది. యోగా చేయకముందు శరీరం బరువుగా, ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం 15 రోజుల్లో మార్పు కనబడింది. యోగా సాధనతో పాటు ఆహారంలో మార్పులు చేసుకోవటం వల్ల ఎంత పనిచేసినా అలస అనేది రావడం లేదు.

–నరసింహ, గ్రీన్ పార్కు కాలనీ

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌ఎఫ్ బృందం

చంచల్‌గూడ: విపత్తుల నుంచి బయటపడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ బృందం శనివారం చావణీలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వాసులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఎఫ్‌ఓ సుధాకర్ ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం నగరంలో సంభవిస్తున్న అగ్ని ప్రమాదాలు, వరదలు, చెట్లు కూలడం, విద్యుత్ స్తంభాలు కూలడం, పాత శిథిలమైన భవనాలు కూలడల వంటి ఘటనల్లో డీఆర్‌ఎఫ్ బృందం ఏ విధంగా ప్రజలను రక్షిస్తారో స్వయంగా చేసి చూపించారు. డీఆర్‌ఎఫ్ కంట్రోల్ రూమ్ 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. డయల్ 100 లేదా 9000113667 కి ఫోన్‌లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఎఫ్ సభ్యులు జగన్, సుమన్, గాజ్యు, హుస్సేన్ పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యలు తెలుసుకున్న అధికారులు



అధికారులకు సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

మలక్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పబ్లిక్ ఇంట్రాక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా శనివారం అక్బర్‌బాగ్ డివిజన్‌లో అధికారులు పర్యటించారు. దయానంద్‌నగర్, గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ వెనుకలైన్‌లోని కాలనీల్లో పర్యటించి కాలనీలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై స్థానికం నెలకొన్న సమస్యలపై చర్చించారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ యుగంధర్‌రెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కాలనీ సభ్యులు నాగరాజుగౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రమేష్, మహ్మద్ నదీమ్, స్ట్రీట్ లైట్స్ డీఈ రాజు, యూసీడీ విభాగం కమ్యూనిటీ ఆర్గనైజర్స్ నర్సింహ రవి, ఉషశ్రీ, శానిటేషన్ జవాన్ యాదయ్య, కృష్ణగౌడ్, మహమ్మద్ గౌస్, ఎంటామాలజీ విభాగం సిబ్బంది ఉన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



అరవిందరెడ్డిని సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఎల్‌బీనగర్: బీఎన్ రెడ్డి డివిజన్ ఎస్‌కేడీ నగర్ కాలనీలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో శనివారం నిర్వహించిన ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు నేత్రపర్వంగా సాగింది. ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోశ్ఛరణల నడుమ నిత్యహోమ పరిసమాప్తి, మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, అనంతరం స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం వంటి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి ఆలయానికి విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ నిర్వాహకులు ఆయన్ను శాలువతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు అమరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, పురుషోత్తంరెడ్డి, జానకి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని వినతి

మన్సూరాబాద్: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని జనసేన ఎల్‌బీనగర్ కో ఆర్డినేటర్ శిరీష పొన్నూరు శనివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం శిరీష మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తయారు చేసిన నివేదికను ఎమ్మెల్యేకు అందజేశామన్నారు. తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వీర మహిళ వెంకటలక్ష్మి, నాయకులు బ్రహ్మజీ, శ్యామ్, బద్రినాథ్, లింగంగౌడ్, అక్షయ్‌రెడ్డి, సురేందర్‌కుమార్, ప్రసాద్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి



ఆసుపత్రి ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఎల్‌బీనగర్: రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలని, తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యం చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బీఎన్ రెడ్డి నగర్‌లో దాసరి సంతోష్ యాదవ్ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీసాయి నేత్రాలయాన్ని శనివారం హరీశ్‌రావు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో బీఎన్‌రెడ్డి నగర్, చర్లపల్లి కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, బొంతు శ్రీదేవి, నాయకులు మాధవరం నర్సింహా రావు, బుచ్చిరెడ్డి, ప్రశాంత్, మధు, శ్రీకాంత్, సంతు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తేనే సమస్యల సత్వర పరిష్కారం

నాగోలు: అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అన్నారు. శనివారం నాగోలు డివిజన్ పరిధిలోని కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ, అరుణోదయ కాలనీల్లో జీహెచ్‌ఎంసీ ఇంటెన్సివ్ శానిటేషన్ అండ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇంట్రాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ, కాలనీల్లోని సమస్యలను అధికారుల దృష్టి తీసుకు రావాలని సూచించారు. కాలనీల్లోని సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. చిన్ని చిన్ని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ఎక్కువగా నిధులు అవసరమైనా చోటా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, జలమండలి మేనేజర్ అలేఖ్యారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



మిషన్ పనితీరు వివరిస్తున్న విద్యార్థులు

మలక్‌పేట: విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపాలని ఐడియల్ డిగ్రీ ఉమెన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ మధుసూదన్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ కాలేజీలో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను వైస్ ప్రిన్సిపాల్ వీవీ శ్రీరామ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ, న్యూట్రీషన్, ఫిజికల్ సైన్స్ విద్యార్థులు రకరకాల నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్, లైవ్ కెమిస్ట్రీ ప్రయోగాలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వీవీ శ్రీరామ్‌కుమార్, లైఫ్ సైన్స్ డీన్ సుమిలారెడ్డి, ఫిజికల్ సైన్స్‌డీన్ రావత్, లెక్చరర్లు డాక్టర్ గాయత్రి, సుచిత, జాహ్నవి, అన్నపూర్ణ, గురుమూర్తి, యల్లప్ప, మంజువాణి పాల్గొన్నారు.

'దళితరత్న' అవార్డుల ప్రదానం



వెంకటేష్‌కు అవార్డు అందజేస్తున్న పాపయ్యమాదిగ

మలక్‌పేట: విద్యార్థి ఉద్యమ నేతలు, తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ గ్రేటర్ అధ్యక్షుడు నక్క వెంకటేష్‌కు, తెలంగాణ విద్యార్థి సమితి రాష్ట్ర అధ్యక్షుడు మంద రమేష్ మాదిగలకు 'దళిత రత్న' అవార్డు దక్కింది. రవీంద్రభారతిలో జరిగిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో రాష్ట్ర ఉత్సవాల కమిటీ వర్కింగ్ చైర్మన్ మేడి పాపయ్య మాదిగ వారికి దళిత రత్న అవార్డును అందజేశారు.

శ్రీనివాసరావుకు అవార్డు ...

మన్సూరాబాద్: ఆలిండియా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సౌత్ రీజియన్ ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాస్‌రావుకు దళిత రత్న అవార్డు దక్కింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు మేడి పాపయ్య చేతుల మీదుగా శ్రీనివాసరావుకు అవార్డు అందజేశారు. జీఎస్‌ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదార్ల మహేష్, సెక్రటరీ మధిర సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సాయి పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శనివారం పంజేషాహలోని కార్యాలయంలో సైదాబాద్, అంబర్‌పేట మండలాలకు చెందిన 160 మందికి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కమల్‌నగర్, మూసానగర్, శంకర్‌నగర్, వాహేద్‌నగర్, హెచ్‌ఆర్‌సీ రోడ్, పాపయ్య బస్తీ, కాలడేరా కాలనీ, ఆజంపుర, సైదాబాద్ కాలనీల, ప్రెస్ కాలనీ, పల్టాన్, కరణ్‌బాగ్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు అందజేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, మజ్లిస్ పార్టీ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సైదాబాద్ మండల ఆర్‌ఐ హరిబాబు, అంబర్‌పేట ఆర్‌ఐ శ్రీకాంత్, ఎంఐఎం నాయకులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, డీసీ మారుతీ దివాకర్

వనస్థలిపురం: ప్రభుత్వ కార్యక్రమాలను నామమాత్రంగా కాకుండా ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే విధంగా అధికారులు కృషి చేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ క్లాం నవజీవన్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటెన్సివ్ శానిటేషన్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇంట్రాక్షన్ కార్యక్రమంలో భాగంగా శనివారం శారదానగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో కాలనీ సమస్యలపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా కావడం తప్ప పనులు మాత్రం జరగడం లేదన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీ దివాకర్, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కేఎల్‌ఎన్ రావు, పలు విభాగాల అధికారులు, సీనియర్ సిటిజెన్స్ పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

నాగోలు: వేసవి కాలంలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీలోని అలకాపురి దగ్గర తెలంగాణ గాడ్జే రజక సంఘం అధ్యక్షుడు పెదపూరే బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదచారులకు మంచినీళ్లు, మజ్జిగ అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఎంతో మేలు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సాయినాథ్‌కు ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: సీఎం రిలీఫ్ ఫండ్ వల్ల ఎంతో మంది పేదలకు మేలు జరుగుతోందని, సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీకి చెందిన జయశ్రీకి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వైద్యానికి అవసరమైన డబ్బుల కోసం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా, రూ. 2.50 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీని శనివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి లబ్ధిదారు భర్త సాయినాథ్‌కు అప్పగించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సత్యంచారి, విజయ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

సైదాబాద్: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన సైదాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... చంపాపేట ప్రెస్ కాలనీలో నివసించే ఆటో డ్రైవర్ గంజి మీనయ్య (63) రోజూ తన ఆటోలో విద్యార్థులను పాఠశాలలో దింపుతాడు. శనివారం ఉదయం పిల్లలను ఆటోలో ఎక్కించుకోవడానికి తన ఇంటి నుంచి బయలుదేరి కర్మన్‌ఘాట్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సామ నర్సింహారెడ్డి గార్డెన్స్ వద్ద ఆటోను యూటర్న్ చేస్తుండగా.. ఆ వైపుగా వేగంగా దూసుకొచ్చిన బైక్ (టీఎస్07 జెఎఫ్5552) ఢీ కొట్టింది. దాంతో అదుపుతప్పి ఆటో నుంచి మీనయ్య కిందపడ్డాడు. తీవ్రగాయాలకు గురైన అతను అపస్మారక స్థితికి వెళ్లాడు. వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఎమ్మెల్యేపై ఆరోపణలు



మాట్లాడుతున్న దేరింగుల కృష్ణ

చంపాపేట: కులం కార్డును అడ్డుపెట్టుకొని రాజకీయ లబ్ధి కోసమే ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ పార్టీనేత ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు దేరింగుల కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల రామ్మోహన్‌గౌడ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ శనివారం కర్మన్‌ఘాట్‌లో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కృష్ణ మాట్లాడుతూ, సుధీర్‌రెడ్డి రెండు సార్లు కార్పొరేటర్‌గా, మరో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, ప్రజా బలమున్న సుధీర్‌రెడ్డిని విమర్శించే నైతిక విలువ రామ్మోహన్‌గౌడ్‌కు లేదన్నారు. ఎల్‌బీ నగర్‌లో కబ్జా కోరల్లో చిక్కుకున్న ఖాళీ పార్కు స్థలాలన్నింటినీ సుధీర్‌రెడ్డి అందమైన పార్కులుగా తీర్చి దిద్దాడనే అక్కసుతోనే రామ్మోహన్‌గౌడ్ ఆయనపై ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆయన ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు, విమర్శలు మాని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటి తీసుకెళ్లేందుకు సహకారం అందిచాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకుడు నారగోని శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి పూర్వ వైభవం ఖాయం



కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం చేస్తున్న లింగాల హరిగౌడ్

సైదాబాద్: భారతీయ జనతా పార్టీకి ఒకప్పుడు కంచుకోటగా ఉన్న మలక్‌పేట నియోజకవర్గంలో పూర్వ వైభవం సాధించడం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సైదాబాద్ డివిజన్ పూసల బస్తీలో పల్లె పల్లెకి ఓబీసీ –ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. అన్నివర్గాల అభివృద్ధి కోసం ప్రధాని నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను వారు ఇంటింటికీ పంచారసరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మలక్‌పేటలో బీజేపీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ల ఎంఐఎం ఎమ్మెల్యే కావాలని అభివృద్ధి పనులు విస్మరిస్తున్నారని విమర్శించారు. మలక్‌పేట సహా పాతబస్తీ సమగ్రాభివృద్ధి సాధించాలంటే తెలంగాణలో బీజేపీని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, గంగిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

క్రియేటివ్ రంగంలో భారత్ ముందంజ

లింగోజిగూడ: క్రియేటివ్ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో భారత్ ముందంజలో ఉందని ఐ క్యాట్ సంస్థ అధినేత కె.శివకుమార్ అన్నారు. ఐ క్యాట్ డిజైన్, మీడియా కళాశాల వార్షిక గ్రాడ్యుయేషన్ షోకేస్ కార్యక్రమాన్ని శనివారం ఎల్‌బీ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నేర్చుకున్న మల్టీ మీడియా, యానిమేషన్, ఫొటోగ్రఫీని ప్రదర్శించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ స్టూడియోస్, బైజూస్ ఎడ్యుకేషన్, రోబో మేకర్ స్టూడియోస్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తమ సంస్థల్లో అవకాశాలు కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ మూర్తి, స్వామినాథ్, ఆలీషా తదితరులు పాల్గొన్నారు.